# సలామ్...లతీషా!

www.freegurukul.org
(Values, Skill Based Education In Digital)
https://t.me/helpfulinfo

- ఆక్సిజన్ సిలెండర్‌తో సివిల్స్ పరీక్షకు
- అరుదైన వ్యాధితో బాధపడుతున్నా సడలని ఆత్మవిశ్వాసంతో ముందుకు..

**సంకల్పం ఉంటే మార్గం దానంతటదే ఏర్పడుతుందని ఒక మహానుభావుడు చెప్పాడు. ఆ సంకల్పమే ఆమెను ముందుకు నడిపిస్తోందేమో అనిపిస్తుంది ఆమెను చూస్తే. ఆ సంకల్పంతోనే ఆమె సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షకు ఆక్సిజన్ సిలెండర్‌తో హాజరైంది. ఆమే లతీషా. ఆమెకు వచ్చిన వ్యాధి ఏమిటి? అరుదైన వ్యాధితో బాధపడుతున్నా సివిల్స్ పరీక్షలు ఎందుకు రాయాలనుకుందనే వివరాలు తెలుసుకుందాం.**



స్ఫూర్తి

లతీషా అన్సారీ వయసు 24 సంవత్సరాలు. కొట్టాయంలోని ఎరుమెలి ప్రాంతానికి చెందినది. లతీషా ఎమ్.కాం. డిగ్రీని పూర్తి చేసింది. మలయాళం ప్రత్యేక సబ్జెక్ట్‌గా తీసుకుని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించింది. ఆమె తన సివిల్స్ పరీక్షను తిరువనంతపురంలో రాసింది. అరుదైన బోన్ డిజార్డర్‌తో బాధపడుతున్నా చిన్నప్పట్నించి చదువంటే అమితమైన ఇష్టం. అలాంటి పరిస్థితుల్లో కూడా చదువును కొనసాగించి డిగ్రీని పొందింది. సివిల్స్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకుంది. తన లక్ష్యసాధన దిశగా వడివడిగా తన ప్రయాణాన్ని సాగిస్తోంది. తన కలల సాకారం కోసం నిరంతరం కృషి చేస్తోంది. ఆదివారం జరిగిన సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షకు ఆమె ఆక్సిజన్ సిలెండర్‌తో హాజరైంది. ఆమెకు వచ్చిన అరుదైన బోన్‌డిజార్డర్ వల్ల ఒక్క నిమిషం కూడా ఆక్సిజన్ సిలెండర్ లేకుండా ఉండలేని పరిస్థితి. అయినా ఆమె వెనుకడుగు వేయలేదు. సివిల్స్ పరీక్షలకు హాజరై దానిలో ఉత్తీర్ణత సాధించాలన్నదే ఆమె లక్ష్యం. దానికోసమే ఆమె నిరంతరం కృషిచేస్తోంది. లతీషాకు వచ్చిన అరుదైన వ్యాధి - టైప్ 2 ఆస్టియోపోరోసిస్ ఇమ్‌పెర్‌ఫెక్టా. పుట్టగానే ఈవ్యాధి లతీషాకు సోకింది. ఈ వ్యాధి కారణంగా ఆమె ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలతో నిత్యం పోరాడుతోంది. ఆ కారణంగానే ఆమె వెంటే ఎప్పుడూ ఆక్సిజన్ సిలెండర్ ఉండాల్సిందే. స్కూల్‌కి వెళ్లాలన్నా, బయటకు వెళ్లాలన్నా ఆమె తండ్రే ఆమెను తీసుకెళ్లేవారు. ఆమె ఏపరీక్షకు వెళ్లాలన్నా తల్లిదండ్రులే దగ్గర ఉండి తీసుకువెళ్తున్నారు. ఆమె సివిల్స్ పరీక్షకోసం ఒకటిన్నర సంవత్సరం నుండి ప్రిపేర్ అవుతుంది. లతీషాకి ప్రతి నెల మందులకోసం 25వేల రూపాయలు అవసరం అవుతున్నాయి. ఆమె శరీరంలో ఇప్పటి వరకు 400 బోన్స్ ఫ్రాక్చర్స్ అయ్యాయి.

"మా అమ్మాయి మందుల కోసం చాలా లోన్లను పెట్టుకున్నాను. తెలిసినవారు, బంధువుల దగ్గరి నుండి చాలా డబ్బులను అప్పుగా తీసుకున్నాను. వాటి గురించి నాకెటువంటి బాధలేదు. లతీషా తన లక్ష్యాన్ని సాధించాలనే నావంతు సహకారాన్ని అందిస్తున్నాను. లతీషా పరిస్థితిని అర్థం చేసుకున్న కొట్టాయం జిల్లా కలెక్టర్ ఆమె సివిల్స్ పరీక్షరాసేటప్పుడు ఉచితంగా ఆక్సిజన్ సిలెండర్‌ను ఏర్పాటు చేసినందుకు కొట్టాయం జిల్లా కలెక్టర్ సుధీర్‌బాబుకి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను" అని లతీషా తండ్రి అన్సారీ చెప్పారు.

లతీషా లాంటి విద్యార్థులు ఎంతోమంది సివిల్స్ పరీక్షలు రాయాలనుకున్నా తగినంత సహకారం, సదుపాయాలు లేక ఆగిపోతున్నారని, ప్రభుత్వం వారికి కావలసిన సదుపాయాలను కలగజేస్తే విద్యార్థులు మంచిగా పరీక్షలు రాసి ఫలితాలను పొందుతారని అమృతవర్షిణి అనే స్వచ్ఛంద సంస్థకి చెందిన లతా నాయిర్ అన్నారు. ఆమె అరుదైన జెనెటిక్ డిజార్డర్లతో బాధపడే పిల్లలకోసం ఒక స్వచ్ఛంద సంస్థ (అమృతవర్షిణి)ను నడుపుతున్నారు.

"పేపర్ చాలా సులువుగా వచ్చింది. ఈ పరీక్షలో నేను విజయం సాధించాలని నాకు తెలిసినవారందరూ మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు. నాలాంటి అరుదైన డిజార్డర్లతో బాధపడుతున్న వాళ్లకు స్ఫూర్తినివ్వాలనే ఉద్దేశంతోనే నేను ఈ పరీక్షకు హాజరయ్యాను" అని లతీషా చెప్పింది.

ఎన్ని సమస్యలున్నా ఒక్క చిరునవ్వుతో వాటిని పక్కకు నెట్టివేసి లక్ష్యసాధనలో ముందుకు దూసుకుపోతోంది లతీషా. ఆమె లక్ష్యాన్ని చేరుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం.